త్రిముఖ పోరులో గెలిచేదెవరో?

- నేడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- తానంటే తాను విజేత అని అభ్యర్థుల ధీమా


దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ అభ్యర్థి


సామ రంగారెడ్డి
బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి


మధుయాష్కి
కాంగ్రెస్ ఎల్‌బీనగర్ అభ్యర్థి

మన్సూరాబాద్: మరి కొన్ని గంటల్లో తేలనున్న ఎన్నికల ఫలితాలపై ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలయ్యింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకర్షించారు. అంతేకాకుండా పోల్ మేనేజ్‌మెంట్‌లో కూడ ప్రధాన పార్టీల అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. ఎల్‌బీనగర్‌లో జరిగిన త్రిముఖ పోరులో విజేతలు ఎవరనేది అంచనాలకు చిక్కకుండా ఉంది. పోలింగ్ ముగిసినప్పటికి ఓటరు తీరును అంచనా వేయటం క్లిష్టంగా మారింది. త్రిముఖ పోరులో విజేతలు ఎవరనేది మరి కొన్ని గంటల్లో తేలనుంది.

ఎవరి ధీమా వారిది..

ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తామే విజయం సాధిస్తున్నామనే ధీమాలో ఉన్నారు. ఓటింగ్ శాతం గతం కన్నా తక్కువగా ఉన్నప్పటికి ఓట్లు పెరిగాయి. మొత్తం 2.91లక్షల పోలైన ఓట్లలో లక్షకు పైగా వచ్చిన అభ్యర్థి విజయం సాధిస్తారనే అంచనాలతో అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. రసవత్తరంగా జరిగిన త్రిముఖ పోరులో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై ఆయా పార్టీల నేతలు ఉత్కంఠకు గురవుతున్నారు.

లెక్కల్లో నిమగ్నం..

- ఎల్‌బీనగర్ గత 5 సంవత్సరాల్లో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపానని ఓటర్లు తనకే అనుకూలంగా ఉన్నారని అధికార పార్టీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసాతో ఉన్నారు. గత 16 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్నానని, గత మూడు ఎన్నికల్లో అన్యాయం జరిగిందనే సానుభూతితో పాటు నియోజకవర్గంలో పటిష్టమైన కార్యకర్తల బలంతో విజయం సునాయసం అనే ధీమాలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఉండగా బీసీ బలంతో పాటు దేశ స్థాయి నాయకుడినని, ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ హవా నడుస్తోందని దీంతో గెలుపు నాదేనని నమ్మకంతో కాంగ్రెస్ అభ్యర్థి మధు యాష్కి ఉన్నారు. ఎవరి లెక్కలు వారికున్న ఎల్‌బీనగర్ అభ్యర్థులు భవిష్యత్ ఈవీఎంలో నిక్షిప్తమై ఉంది. తామే విజయం సాధిస్తామని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు.

అంతటా టెన్షన్..టెన్షన్..

- భవితవ్యంపై అభ్యర్థులు, పార్టీల నాయకుల్లో పెరిగిన ఉత్కంఠ
- ఎగ్జిట్‌పోల్స్‌పై అన్ని పార్టీల అభ్యర్థుల్లోనూ ఆందోళన

దిల్‌సుఖ్‌నగర్: పోలింగ్ పూర్తి కావడం, కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అంతట టెన్షన్ వాతావరణం నెలకొంది. కొన్ని రోజులుగా ప్రచారాలతో బిజీబిజీగా ఉన్న ప్రధాన పార్టీల నాయకులు కౌంటింగ్ సమయం ఆసన్నమవడంతో నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత సంవత్సరం కంటే పోలింగ్ తక్కువ కావడంతో అది ఎవరికొంప ముంచుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి పార్టీల టికెట్లు తెచ్చుకొని రాత్రింపగళ్లు అంతటా ప్రచారం చేసి ఇప్పుడు ఎన్నికల్లో గెలవకపోతే పరిస్థితి ఏమిటని తమ భవిష్యత్తు అంతా అంధకారమైపోతుందని అటు పార్టీల అభ్యర్థులు, నాయకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల్లోని పార్టీల అభ్యర్థుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎక్కడ కనిపించడం లేదు. మరికొంత మంది చిన్నాచితక పార్టీలు, ఇండిపెండెంట్ల అభ్యర్థులు తమ ఓటమిని ముందుగానే నిర్ణయించుకున్నారు. గెలుపుపై ఆశలు పెట్టుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టిన తమకు కచ్చితంగా విజయం లభిస్తుందని గంపెడాశతో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ పార్టీల అభ్యర్థుల ఆందోళనకు తెరపడాలంటే ఇక మరి కొన్ని గంటలు ఈ టెన్షన్ అనుభవించక తప్పదు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


కనకదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహించిన బీజేపీ నేతలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి విజయం సాధించాలని ఎల్‌బీనగర్‌కు చెందిన బీజేపీ నేతలు శనివారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాంపల్లి రామేశ్వర్, గంగదాసు కృష్ణారెడ్డి, కృష్ణంరాజు, అశోక్ కుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగెస్ర్ పార్టీనే’



దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసిన సందర్భంగా శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పరిశీలించిన రోనాల్డ్ రాస్


అంబర్‌పేట ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీస్తున్న జిల్లా ఆర్‌ఓ రోనాల్డ్ రాస్

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా ఆర్‌ఓ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అంబర్‌పేట ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మలక్‌పేట నియోజకవర్గ డీఆర్‌సీ సెంటర్‌ను శనివారం సందర్శించారు. ఆదివారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం చేస్తున్న ఏర్పాటు పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు అభ్యర్థులకు, ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్–6 డీసీ జయంత్, ఈఈ పీర్‌సింగ్, ఏడీఈలు ప్రదీప్‌కుమార్, బన్సీలాల్, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప పూజలో మంత్రి


పూజలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: అయ్యప్ప నామస్మరణతో జల్‌పల్లి శనివారం మార్మోగింది. గ్రామానికి చెందిన సూరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి మాలధారణతో శబరిమలకి కాలినడకన వెళ్లొచ్చి పడిపూజ నిర్వహించారు. దీనికి మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జనార్దన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


శ్రీలత(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ ప్రాంతానికి చెందిన శ్రీలత(28) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన సోదరి అరుణజ్యోతి ఇంటి సమీపంలో నివాసం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీలత బయటికి వెళ్తున్నానని తల్లికి చెప్పింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో సోదరి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి


ఎంటామాలజీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీల్లో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంటమాలజీ విభాగం అధికారులకు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి శనివారం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువు పరిసరాల్లోని కాలనీవాసులు కొద్ది రోజులుగా దోమల బెడద గురించి తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందని, దానిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని కార్పొరేటర్ ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొ. క్యారోలిన్‌కు గ్రీన్ టెక్ ఆహ్వానం


వీజేఈ క్యారోలిన్

మలక్‌పేట: ఈనెల 7, 8 తేదీల్లో దుబాయ్ ఎక్స్‌పో సిటీలో ఐఈఈఈ టీమ్స్ (టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ సొసైటీ) యూనివర్సిటీ ఆఫ్ దుబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐఈఈఈ గ్రీన్ టెక్ సింపోజియంకు అరుదైన అవకాశం దక్కిందని ప్రొఫెసర్ డాక్టర్ వీజేఈ క్యారోలిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలకు చెందిన మేధావులు పాల్గొనే సింపోజియంలో ‘సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అండ్ స్లమ్స్’అనే అంశంపై ప్రసంగించనున్నారని తెలిపారు.

బీసీని సీఎం చేయాలి

హస్తినాపురం: తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం హస్తినాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..బీసీలను సీఎం సీటు దగ్గరకు రానివ్వని పార్టీలు 60 శాతం బీసీ ప్రజల తరపున 75 ఏళ్ల నుంచి అందని ద్రాక్షలానే మిగిలిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ఆదివారం జరగబోయే ఓట్ల లెక్కింపులో మెజార్టీ స్థానాలు సాధించిన పార్టీ సీఎంగా బీసీని చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, బోయపల్లి లింగస్వామి, వలిజాల యాదయ్య, నాంపల్లి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు

‘అఖండ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీదే విజయం’


రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

మలక్‌పేట: టీపీసీసీ ప్రధానకార్యదర్శి, మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఆఖండ మెజార్టీతో విజయం సాధించి, అధికార పగ్గాలు చేపడుతుందని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, యాదిలాల్, సాయిరామ్, తదితరులు ఉన్నారు.

నర్సింహ ఇంటిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నాగోలు: సీపీఐ సీనియర్ నాయకుడు బాతరాజు నర్సింహ ఇంటిపై దాడి చేసిన వారిని శిక్షించాలని సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యవర్గ సభ్యుడు బోయపల్లి రాములుగౌడ్, ఎన్టీఆర్‌నగర్ శాఖ కార్యదర్శి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నర్సింహతో కలిసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. శుక్రవారం నర్సింహ ఇంటి పక్కనే ఉండే శ్రీను అతని కుటంబసభ్యులు పాత గొడవలు మనుస్సులో పెట్టుకుని దాడికి పాల్పడ్డారని వారు తెలిపారు. ఎల్‌బీనగర్ పోలీసులు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతుబజారుల్లో కూరగాయల ధరలు..



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు.. (కిలో..రూపాయల్లో) టమాట 23, వంకాయ 18, బెండ 40, పచ్చి మిర్చి 35, కాకర 20, బీర 35, క్యాబేజి 11, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 32, దొండ 23–26, చిక్కుడు 23–45, గోకర 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 35, ఆలు 23, దోస 18, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 37. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అంబర్‌పేట స్టేడియంలో మలక్‌పేట ఓట్ల లెక్కింపు

- ఏడు టేబుళ్ల చొప్పున రెండు వరుసలు
- 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు


కౌటింగ్ ఏర్పాట్లు చేసిన అంబర్‌పేట మున్సిపల్ స్టేడియం

మలక్‌పేట: మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభ కానుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు ఫలితాలు పూర్తిగా వెలువడే అవకాశాలు ఉన్నాయి. 300 పోలింగ్ సెంటర్లు ఉండటంతో 22 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. 7 టేబుళ్ల చొప్పున రెండు వరుసల్లో 14 టేబుళ్లు నిర్ణయించారు. రెండు వరుసల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించేందుకు చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను తీసుకొచ్చి అభ్యర్థుల పక్షాన హాజరైన ఏజెంట్ల సమక్షంలో టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

నియోజకవర్గంలో 3,17,866 మంది ఓటర్లు ఉండగా, నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో 1,31,354 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 41.32 శాతం మేర పోలింగ్ జరిగింది. ఇందులో పురుష ఓటర్లు 1,60,880 మంది ఉండగా 67,482 మంది, 1,56,972 మహిళా ఓటర్లలో 63,872 మంది ఓటు హక్కును సద్వినియోగించుకున్నారు. ఇతరులు (ట్రాన్స్‌జెండర్స్) 14 మంది ఉన్నారు. వీరు ఎక్కడా తమ ఓటు హక్కు వినియోగించుకోలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం చూపిన ఆసక్తి ఓటింగ్‌లో వారు చూపలేదని సమాచారం.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పూజలు


ఆశీర్వాదం తీసుకుంటున్న సంఘిరెడ్డి దంపతులు

మలక్‌పేట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రొద్దుటూరి సంఘిరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి శనివారం తిరుమల హిల్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల చేత ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జరగనున్న ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలలో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందన్నారు.

ఓటు బ్యాంక్ పెరిగేనా.. తగ్గేనా...?

చంచల్‌గూడ: యాకుత్‌పురా నియోజకవర్గంలో ప్రతిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం, బీజేపీ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉండేది. 2014లో ఎంఐఎం అభ్యర్థి ముంతాజ్‌ఖాన్ 66,843 ఓట్లు, బీజేపీ అభ్యర్థి రూప్‌రాజ్ 32,420 ఓట్లు, ఎంబీటీ అభ్యర్థి మజీదుల్లాఖాన్ 28,793 ఓట్లు, టీఆర్‌ఎస్ పార్టీ షబ్బీర్ అలీ 7862 ఓట్లు సాధించారు. 2014లో రెండో స్థానంలో ఉన్న బీజేపీ 2018లో మళ్లీ రెండవ సారి రూప్‌రాజ్‌కు టికెట్ కేటాయించడంతో అనుహ్యంగా 16,608 ఓట్లతో నాలుగో స్థానానికి పడిపోయింది. టీఆర్‌ఎస్ నుంచి మొదటి సారి పోటీ చేసిన సామ సుందర్‌రెడ్డి 22,617 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. ఎంబీటీ నుంచి పోటీ చేసిన మజీదుల్లాఖాన్ 21,222 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. కాగా తాజా ఎన్నికలు యాకుత్‌పురాలో చతుర్ముఖ పోరుగా మారింది. తనకున్న ఓటు బ్యాంక్‌తో పాటు ఎంఐఎం ఓటు బ్యాంక్‌ను ఎంబీటీ పెద్ద ఎత్తున్న చీల్చితే తప్పా బీజేపీ, బీఆర్‌ఎస్‌కి గెలిచే అవకాశం లేకపోలేదు. ఎంఐఎం నుంచి నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, బీజేపీ నుంచి గతంలో లోక్‌సత్తా పార్టీ నుంచి పోటీ చేసిన వీరేందర్‌బాబు యాదవ్, ఎంబీటీ నుంచి అజంపురా మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్, బీఆర్‌ఎస్ నుంచి సామ సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి రవిరాజులు పోటీ పడ్డారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి


గణేష్ టెంపుల్ రోడ్డులో నిలచిపోయిన వాహనాలు

వనస్థలిపురం: గణేష్ టెంపుల్ రోడ్డు, రైతుబజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణేష్ టెంపుల్ రోడ్డులో పలు వాణిజ్య కేంద్రాలు, ఆలయాలు ఉండడంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే వనస్థలిపురం రైతుబజారు చౌరస్తాలో వనస్థలిపురం నుంచి సుష్మ చౌరస్తా, బీఎన్‌రెడ్డినగర్ వైపు నుంచి, హయత్‌నగర్ వైపు వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆయా కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన


లక్ష పుష్పార్చనలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు


పూజల్లో శ్రీవామన ఆశ్రమ మహా స్వామీజీ

నాగోలు: కొత్తపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వామన ఆశ్రమ మహా స్వామీజీ ఆధ్వర్యంలో జరిగింది. ఐవీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పూర్వ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు చంద భాగ్యలక్ష్మి, శైలజ, మణిమాల, అనిత, జేయ శ్రీ, అర్చన, వీణ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం వామన మహా స్వామీజీ భక్తులకు అనుగ్రహభషణం చేశారు. ఈ సందర్భంగా స్వామీజి మాట్లాడుతూ.. హిందూ ధర్మం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఐవీఎఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ పబ్బా చంద్రశేఖర్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, అడ్వైజర్ ముత్యాల సత్తయ్య, యువజన అధ్యక్షుడు కట్ట రవికుమార్, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ బోనగిరి శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభు పాండయ్య గుప్తా, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ యువజన నాయకుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డీర్ పార్కులో కుల రహిత వనభోజనాలు

మన్సూరాబాద్: కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధి మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు (డీర్ పార్కు)లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి కుల రహిత వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు కుల నిర్మూలన సంఘం ప్రతినిధులు తెలిపారు. వనభోజనాల పేరిట జరుగుతున్న కుల భోజనాలను బహిష్కరిద్దామని, కుల రహిత సహపంక్తి భోజనాలను ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. కుటుంబాలతో కలిసి రావాలని, అందరం కలిసి ఆడుదాం.. పాడుదామని విజ్ఞప్తిచేశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 1న మధ్యాహ్నం 2 గంటల సమయంలో చంపాపేట్ చెక్‌పోస్టు వద్ద 50–55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో 108 అంబులెన్స్ సహాయంలో పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి రాత్రి 8.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నృత్యం.. మనోహరం..

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అర్చన గూటి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలు అంశాలను భవ్య, సహస్ర, కృతి, కీర్తన, హంసిని, ప్రవళిక ప్రదర్శించి మెప్పించారు. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, ఆట డాన్స్ అకాడమి డైరెక్టర్ విజయ్ కుమార్ విచ్చేసి కళాకారులను అభినందించారు.

